పవన్ కళ్యాణ్ పర్యటన వాయిదా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటన విషయంలో ఆర్అండ్‌బి శాఖ మోకాలడ్డింది. బుధవారం చేపట్టాల్సిన పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటన వాయిదా పడిందని జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ అధికార పార్టీ కుట్రలో భాగంగానే హెలీకాప్టర్ దిగేందుకు అనుమతి ఇవ్వలేదని విమర్శించారు. వైసిపికి ఓటమి భయం పట్టుకుందని, దీంతోనే తమ నాయకుడు రాకను జీర్ణించుకోలేక పర్యటనకు అడ్డుపడుతున్నారని విమర్శించారు. పర్యటన ఎప్పుడనేది తెలియజేస్తామన్నారు. అయితే ఇప్పటికే జనసైనికులు ఉత్సాహంతో భీమవరంలో ఏర్పాట్లు చేసుకున్నారు. పర్యటన వాయిదా పడిందని తెలియడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

ఎంఎల్‌ఎలకు పట్టదు.. కలెక్టర్లు రారు..!

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

తూతూమంత్రంగా తయారైన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజా సమస్యల పరిష్కారం పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు

సమస్యలపై ఏకరువు పెట్టిన స్థానిక ప్రజాప్రతినిధులు

తూర్పు, పశ్చిమ కలెక్టర్లు హాజరుకాకపోవడంపై స్థానిక ప్రజాప్రతినిధుల ఆగ్రహం

సభ నుంచి వాకౌట్ చేసేందుకు సిద్ధమై వెనక్కి

ఈసారి కలెక్టర్లు రాకపోతే సమావేశం జరపను ; జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశం తూతూమంత్రంగా మారింది. ప్రజా సమస్యలకు వేదికగా మారాల్సిన సమావేశం నామకహ అన్నట్లు తయారైంది. అత్యంత ముఖ్యమైన జిల్లా పరిషత్ సమావేశానికి 15 మంది ఎంఎల్‌ఎలకుగాను ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు తప్ప, మిగిలిన ఎంఎల్‌ఎలు ఏ ఒక్కరూ హాజరు కాని పరిస్థితి. జిల్లా కలెక్టర్లు కూడా సమావేశానికి రాకపోతే తమ సమస్యలు ఎవరికి చెప్పు కోవాలంటూ పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పరిస్థితి నెలకొంది. ఆయా జిల్లాలకు చెందిన సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసేందుకు నిర్ణయించి వెనక్కి తగ్గిన పరిస్థితి కొనసాగింది. ఇక నుంచి జిల్లా కలెక్టర్లు హాజరుకాకపోతే జిల్లా పరిషత్ సమావేశం జరపనంటూ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన పరిస్థితి నెలకొంది. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ అధ్యక్షులు ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ అధికారి శివ నారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులైన జెడ్‌పిటిసిలు సమస్యల ఏకరువు పెట్టారు. వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక జెడ్‌పిటిసి కుంజా రామలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

ముంపు మండలాలు కావడంతో విద్యుత్, రోడ్లు వంటి అనేక సమస్యలను పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దెందులూరు, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మిగిలిన జెడ్‌పిటిసిలు మాట్లాడుతూ రోడ్లు, తాగునీరు, జగనన్నకాలనీలో మౌలిక సదుపాయాలు వంటి అనేక సమస్యలను లేవనెత్తారు. నాడు - నేడు పనులు ముందుకు సాగడం లేదన్నారు. గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదంటూ స్థానిక ప్రజాప్రతినిధులు గగ్గోలు పెట్టిన పరిస్థితి నెలకొంది.

అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి : జెడ్‌పి ఛైర్‌పర్సన్

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో జరిగే పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచి వంటి స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచార లోపం జరిగినట్లు ఫిర్యాదులు వస్తే సదరు అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిషత్ సమావేశాల్లో వివిధ శాఖల పనులకు సంబంధించి సభ్యులు వెలిబుచ్చిన సమస్యలపై తీసుకున్న చర్యలను సంబంధిత మండలస్థాయి ప్రజాప్రతినిధులకు కూడా తెలియజేయాలన్నారు. పేదప్రజల సంక్షేమానికి సామాజిక, ఆర్థిక, రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేయడంతో పాటు సమాజంలోని అన్ని వర్గాలకూ సామాజిక న్యాయం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి నవరత్నాల కార్యక్రమం కింద మానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారన్నారు. ప్రభుత్వ పథకాల్లో ఎటువంటి అవినీతికి తావులేకుండా లబ్ధిదారులకు నేరుగా అకౌంట్‌లోనే జమ చేయడం జరుగుతోందన్నారు. పంచాయతీ రాజ్, ఉపాధి హామీ చట్టం,

హాజరైన సభ్యులు

ఆర్‌డబ్ల్యుఎస్, తదితర శాఖల ద్వారా మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అనంతరం పనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని తెలిపారు. సభ్యులు తెలియజేసిన సమస్యలపై జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ స్పందిస్తూ వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, తోటకూరగొమ్ము, దాచారం, కొయిదా తదితర గ్రామాల్లో తాగునీటి సమస్యకు మంచినీటి బోర్లు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. జలకళ బోర్లు ఏర్పాటు, ఇళ్ల స్థలాల మంజూరు, నాడు-నేడు పనుల ప్రగతి, తదితర అంశాలపై సభ్యులు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుచేయండి : జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాలకు సంబంధించి పూర్తి చేసిన పనుల బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. పేదల ఇళ్ల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాలో జగనన్న భూ హక్కు, భూసర్వే కార్యక్రమం కింద అధునాతన పద్ధతిలో డ్రోన్ల ద్వారా రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టామని, సదరు జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. సర్వే అనంతరం సదరు భూ యజమానుల నుంచి సక్రమంగా ఉన్నాయని అంగీకారం తీసుకుంటారని, యజమానులు అభ్యంతరం వెల్లడించినట్లయితే సదరు సమస్య పరిష్కరించి, తరువాత మాత్రమే భూ హక్కు సర్వే పత్రం ముద్రించి సదరు రైతుకు అందించడం జరుగుతుందని సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కలెక్టర్ చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యను మినిట్స్‌లో నమోదు చేసి, తదుపరి సమావేశంలో సదరు సమస్యపై తీసుకున్న చర్యలను తెలియజేయాలన్నారు.

90 శాతం పనులు పూర్తయ్యాయి.. వినియోగంలోకి తీసుకురండి ; పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ

ఉంగుటూరు నియోజకవర్గంలో నాడు-నేడు కార్యక్రమం కింద నిర్మిస్తున్న పాఠశాలల అదనపు తరగతి గదులు, అంగన్వాడీ భవనాలు, ఇతర నిర్మాణ పనుల్లో కొన్ని 90 శాతం పూర్తయ్యాయని, డోర్లు, ఫర్నీచర్ వంటి కొన్ని సౌకర్యాలు కల్పించినట్లయితే వెంటనే వినియోగంలోకి తీసుకురావచ్చని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) కోరారు. అధికారులు ఆ దిశగా పనిచేయాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిలో కలపర్రు నుండి గుండుగొలను మధ్య రోడ్లు గుంతల కారణంగా వాహనాలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ ప్రాంతంలో రహదారి మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇటీవల ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో దెందులూరు తాజా, మాజీ ఎంఎల్‌ఎల మధ్య ఘర్షణపై ఆరోగ్యశాఖ అధికారుల తీరుపైనా చర్చ కొనసాగింది.

డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, గృహనిర్మాణ శాఖ పీడీ కె.రవికుమార్, వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ట్రాన్స్కో సూపరింటెండింగ్ ఇంజినీర్లు శ్రీనివాసరావు, కేథారేశ్వరరావు, సత్యనారాయణ, సాల్మన్ రాజు, డిఎంహెచ్ఒ శర్మిష్ఠ, డ్వామా పీడీ ఎ.రాము, జెడ్‌పిటిసిలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో మెరిశారు..

ప్రజాశక్తి - తణుకు

2024 జెఇఇ మెయిన్స్‌లో తమ స్కూల్ పూర్వ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని మాంటిస్సోరీ స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాష్‌రావు తెలిపారు. ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకూ తమ స్కూల్లో చదివిన పూర్వ విద్యార్థి డి.సోహన్ మహేంద్ర 99.96, ఎస్.సుప్రియ 99.46 పర్సంటేజ్ సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. జె.మణికంఠ నిర్దేష్ 94.5, డి.భాను శ్రీలలిత 94.1 పర్సన్‌టైంజ్ సాధించినట్లు వివరించారు. వారిని స్కూల్ ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించారు.



నెక్కంటి నిశాంత్, 99.53 పర్సంటైల్

ఎస్.సుప్రియ 99.46 పర్సంటైల్



కె.యశ్వంత్ 99.04 పర్సంటైల్

శ్రీసూర్య విద్యార్థుల ప్రతిభ

నరసాపురం : జెఇఇ మెయిన్స్‌లో నరసాపురం 23వ వార్డు కౌన్సిలర్ కావలి రామసీత నాని దంపతుల కుమారుడు కావలి యశ్వంత్ 99.4 శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. అతనిని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అభినందించారు. అలాగే శ్రీసూర్య విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించారు. ఓపెన్ కేటగిరిలో పి.విష్ణుమూర్తి 93.6, ఎం.భావన 93.4, జె.ఇవాంజిల్ 92.9, ఎస్‌సి విభాగంలో వి.అక్షయ 52 పర్సంటైజ్ సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన వారిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి చంద్రశేఖర్, కళాశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ అడ్వయిజర్ బి.రామచంద్ర రెడ్డి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఫాజల్, కె.జానకి రామ్, విఆర్ఎస్.కుమార్, కె.త్రిమూర్తులు వేణుగోపాల్, కె.కరుణ్‌కుమార్, జె.సుబ్బారావు పాల్గొన్నారు.

భాష్యం విద్యార్థుల హవా

పెనుగొండ : పెనుగొండ భాష్యం విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చారని సంస్థ ప్రిన్సిపల్ ఎన్‌వి.అప్పారావు తెలిపారు. నెక్కంటి నిశాంత్ 99.53, నెక్కంటి నవీన 98.34, అంజూరి మోక్షజ్ఞ 96.05 పర్సన్‌టేజ్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు ఇంతటి ఘన విజయాన్ని సాధించడం గర్వంగా ఉందన్నారు. వారిని భాష్యం విద్యాసంస్థల అధినేత, ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, సిఇఒ భాష్యం హనుమంతరావు, జోనల్ ఇన్‌ఛార్జి ఏ శ్రీమన్నారాయణరెడ్డి అభినందించారు.

ఆదిత్య విద్యార్థుల హవా

పాలకొల్లు : పాలకొల్లు ఎల్ఆర్‌పేటలోని మాంటిస్సోరీ జూనియర్ కళాశాల విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చారు. 14 మంది విద్యార్థులు అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించగా 6 గురు విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించి నిట్‌లో సీట్లు సాధించడానికి తగినన్ని మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌పిఎస్.ప్రకాష్ తెలిపారు. బండారు శ్రీ సాహితి, కొయ్యే రేమా కుమారి, చలంకూరి మహిశ్రీ, ఇంజేటి చరణ్, రుద్రాక్షలు నాగేంద్ర, వీరా సుమంత్ ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. వారిని అధ్యాపకులు బి వి . స త్య నా రా య ణ , వి.రాంకోటేశ్వరరావు, జెవి.రామకృష్ణ, ఎన్.మల్లీశ్వరి, పి.ప్రదీప్ పాల్గొన్నారు. అలాగే పాలకొల్లు ఆదిత్య విద్యార్థి బైలా సంజిత్ 99.61 పర్సంటైల్ సాధించి అత్యుత్తమ స్థానంలో నిలిచాడు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి మాట్లాడారు. వాసిరెడ్డి దేవన్షరణ్ 99.57, తరపట్ల సంతోష్ 99.49, పోతురాజు శ్రీనివాస శ్రీసాయిగణేష్ 99.27, పచ్చిపాల నేహంత్ 98.72, అరిగెల విఖిలేష్ కృష్ణ 98.62, లంకలపల్లి గుణసాయి చరణ్ తేజ 98.54, శేతలూరి నిరుపమ ఐశ్వర్య 98,07 పర్సంటైల్ సాధించారని తెలిపారు. వారిని, అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి, ఎఒజి.వాసుబాబు అభినందించారు.

మాట్లాడుతున్న లక్ష్మయ్య

మోటార్ వాహనాల చట్ట సవరణ అన్యాయం

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

ప్రజాశక్తి - భీమవరం

దేశంలో మోటార్ వాహన చట్ట సవరణ డ్రైవర్లకు ప్రమాదకరంగా మారిందని, కేంద్రంలో మోడీ ప్రభుత్వ నియంతృత్వ పాలనకు ఇది నిదర్శమని ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మోటార్ వాహన చట్ట సవరణకు వ్యతిరేకంగా ది భీమవరం ఏరియా ఆక్వా అనుబంధ పరిశ్రమల వెహికల్స్ డ్రైవర్స్ యూనియన్, జై శ్రీభారత్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు యూనియన్ నాయకులు ఎస్‌కె.భాషా అధ్యక్షత వహించగా, లక్ష్మయ్య మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. పార్లమెంటులో నియంతృత్వంగా, ఏకపక్షంగా మోటార్ వాహన చట్ట సవరణ చేసి ఆమోదించడం దారుణమన్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాల నివారణ అంటే డ్రైవర్లకు భారీ జరిమానాలు, కఠిన శిక్షలు వేయాలనేది చట్టంలో సారాంశం అన్నారు. రవాణా రంగాన్ని పూర్తిగా నాశనం చేసేలా బిఎన్ఎస్ 2023 క్లాజ్ 106 (1)(2) సెక్షన్ తేవడం అన్యాయమన్నారు. దేశంలో జరిగే ప్రమాదాల్లో 67 శాతం ప్రమాదాలు దేశంలో రెండు శాతం ఉన్న జాతీయ రహదారుల్లోనే జరుగుతుందని తెలిపారు. అంటే జాతీయ రహదారుల నిర్మాణంలోనే ప్రభుత్వాలు నిబంధనలకు అనుగుణంగా నిర్మించడం లేదని ఆరోపించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే ప్రాథమిక విచారణకు పోలీసులతో పాటు నిపుణుల కమిటీ ఉంటుందని తెలిపారు. నిష్పక్షపాతంగా ప్రమాదాలకు వాస్తవ కారణాలు పరిశీలించాకే వాటి ఆధారంగా ఛార్జిషీటు దాఖలు అవుతుందని గుర్తు చేశారు. కానీ మన దేశంలో ప్రమాదాలకు గల కారణాలను విచారణ చేయకుండా డ్రైవర్లకు భారీ జరిమానాలు, కఠిన శిక్షలు వేస్తే సరిపోతుందని అప్పుడే ప్రమాదాలను నివారించొచ్చని చెప్పడం హాస్యాస్పదమని తెలిపారు. ఈ నెల 16వ తేదీన రైతులు, కార్మికులు చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో రవాణా కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక వ్యవస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న రవాణా రంగ కార్మికులకు వ్యతిరేకంగా మోడీ చట్టం తేవడం దారుణమన్నారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి తోట రామకృష్ణ, ఆక్వా పరిశ్రమల డ్రైవర్స్ యూనియన్ నాయకులు జి.కోటి, పితాని శ్రీనివాస్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

భీమవరంలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగా నరసింహమూర్తి పిలుపునిచ్చారు. భీమవరంలో రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మోటర్ సైకిల్ యాత్ర మంగళవారం ప్రారంభించారు. ఈ యాత్రను నరసింహమూర్తి ప్రారంభించారు. భీమవరం సిఐటియు కార్యాలయం నుంచి ప్రారంభమైన యాత్ర భీమవరం పట్టణం, తాడేరు, తుందుర్రు మత్స్యపురి మీదుగా వీరవాసరం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఎఐటిసి నాయకులు చెల్లబోయిన రంగారావు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు లంక కృష్ణమూర్తి, దండు శ్రీనివాస్‌రాజు, సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు నారా యణమూర్తి, రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషపు ఆసిరియా, బొబనపల్లి సూర్యచంద్రరావు కార్మిక సంఘ నేతలు వర లక్ష్మి, రాజు, అప్పన్న, వెంకటపతి రాజు, దుగ్గిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సిఐటియు పట్టణ కమిటీ, పెంటపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి ఎస్‌విఆర్ విగ్రహం మీదుగా కండకట్ల, యాగర్లపల్లి, రామచంద్రరావు పేట, భాగ్యలక్ష్మిపేట మీదుగా పెంటపాడు వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను హాజరై మాట్లాడా రు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కమిటీ సభ్యులు, సిపిఎం పెంటపాడు మండల సభ్యులు పాల్గొన్నారు.

యలమంచిలి : ఎపి రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని చించినాడ, కలగంపూడి, యలమంచిలి, ఆర్యపేట, మేడపాడు, కట్టుపాలెం, దొడ్డిపట్ల, ఇరపకుర్రు గుంపర్రు గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసా య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, కెవిపిఎస్ నాయ కులు బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, కౌలు రైతుల సంఘం నాయకులు మాసవ రపు సుబ్బారావు, మోహన్‌రావు, నాయకులు ఆంజనేయులు, స్టాలిన్, భాస్కరరావు, శ్రీను, వెంకటస్వామి లూథర్ బాబు పాల్గొన్నారు.

నరసాపురం : కరువు, తుపాన్ల వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్స్ రాయితీ, పంటల బీమా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు అన్నారు. మండలంలోని రుస్తుంబాద సెంటర్ నుంచి మొగల్తూరు వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీతారామపురం సెంటర్‌లో నిరసన తెలతిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, రైతు సంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీరామచంద్రమూర్తి, కౌలు రైతు సంఘం మండలాధ్యక్షుడు పిల్లి కామేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుబ్బల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యడ్ల చిట్టిబాబు, రైతు సంఘం సీనియర్ నాయకులు ఆదూరి సాంబమూర్తి, సిఐటియు నాయకులు నారాయణరావు, జల్లి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

వీరవాసరం : రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేప ట్టిన మోటార్ సైకిల్ యాత్ర మంగళవారం వీరవాసరం చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు మాట్లాడారు. బైక్ యాత్ర చింతలకోటి గరువు, రాయకుదురు, కొనితివాడ, వేంద్ర మీదుగా పాలకోడేరు వెళ్లింది.

తాడేపల్లిగూడెంలో బైక్ ర్యాలీ

మొగల్తూరు : కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతారాంపురం సెంటర్ నుంచి మొగల్తూరు గాంధీ బొమ్మ సెంటర్ వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కవురు పెద్దిరాజు, సిఐటియు జిల్లా నాయకులు తెలగంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పిల్లి కామేశ్వరరావు మాట్లాడారు.

తణుకు రూరల్ : పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, కె.ముత్యాలరావు, జి.పద్మారావు, కె.రాజశేఖర్, బి.శ్రీను, సిహెచ్.పాపారావు, పి.సుగుణరావు, ఎన్ఎన్.శ్రీను పాల్గొన్నారు.

ఆకివీడు : స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో మండల కన్వీనర్ తోట రామకృష్ణ అధ్యక్షతన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ మాట్లాడారు. అనంతరం ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు మండల నాయకులు హనుమంతు, సత్యనారాయణ, గోవిందు, అజయ్, కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు

ర్యాంపులను పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - పెనుగొండ

ఇసుక ర్యాంపుల వద్ద ఎటువంటి రవాణా, తవ్వకాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. సిద్ధాంతం, నడిపూడి ఓపెన్ ఇసుక ర్యాంపులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. సిద్ధాంతంలో రెండు, నడిపూడిలో రెండు ఇసుక ర్యాంపులను సెబ్ అడిషనల్ ఎస్‌పి ఎటివి.రవికుమార్, ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఆచంట మండలం కోడేరు, కరుగోరుమిల్లి గ్రామాల్లో రెండు ఇసుక ర్యాంపులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రెండు మండలాల్లో ఇసుక తవ్వకాలు పున:ప్రారంభించేందుకు పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈలోగా ఇసుకు అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా జరుగుతున్నాయో లేదోనని క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. అక్రమ తవ్వకాలు జరిపేందుకు ఎటువంటి మిషనరీలు, యంత్రాలు లేవని తెలిపారు. ర్యాంపుల వద్ద ఎటువంటి రవాణా, తవ్వకాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆమెతో పాటు ఎఎస్‌పి ఎటివి.కుమార్, ఆర్‌డిఒ ఎం.అచ్యుతా అంబరీష్, జలవనరుల శాఖ ఎస్ఇ శ్యామ్‌ప్రసాదు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇకె.వెంకటేశ్వరరావు, గోదావరి రివర్ కన్వర్జెటరు, ఇఇ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్లు వి.అన్నపూర్ణ, డి.సుగుణ సంధ్య, నీటి పారుదల, మైన్స్, కాలుష్య నియంత్రణ, రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నేతలకు గుర్తింపు లేదు..

ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజుపై కిషోర్‌కుమార్, రామ నాగ గోవిందరాజు విమర్శలు

ప్రజాశక్తి - ఆచంట

వైసిపికి విధేయులమే కాని రంగనాథరాజు ఎంఎల్‌ఎ అభ్యర్థిత్వానికి వ్యతిరేకమని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వైట్ల కిషోర్‌కుమార్, రాష్ట్ర బిసి సెల్ మాజీ జనరల్ సెక్రటరీ కడలి రామనాగగోవిందరాజు అన్నారు. ఆచంటలో వైట్ల కిషోర్‌కుమార్ ఇంటి ఆవరణలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు వైసిపి నాయకులకు, కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వడంలేదన్నారు. ప్రతి గ్రామంలో రెండు మూడు గ్రూపులుగా విభజించి కొమ్ముకాస్తున్నారన్నారు. డబ్బుంటే ఏదైనా చేయగలమనే అహంకారంతో నిజమైన పార్టీ కార్యకర్తలను దూరం చేసుకోవడం తగదన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి జెండాలు మోసిన కార్యకర్తలపై కేసులు పెట్టి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఎంఎల్‌ఎ రంగనాథరాజుకు తప్ప నియోజకవర్గంలో వైసిపి టికెట్ ఎవరికిచ్చినా అత్యధిక మెజార్టీతో వైసిపి జెండాను ఎగరవేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఉల్లం రామాంజనేయులు, తప్పెట్ల వెంకట్రావు, దేవిరెడ్డి రాంబాబు, వస్క ఉమేష్, మనువర్తి విజయ్‌కుమార్, గుత్తుల రామకృష్ణ, ఎం.నానిబాబు, బండి మహేష్, కేతా రామకృష్ణ, కేతా రామారావు, చింతపర్తి ప్రసాద్, మంగిన శ్రీను పాల్గొన్నారు.

కాగా ఆచంట నియోజకవర్గంలో రెండు రోజులుగా వైసిపిలో అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయి. గత ఆదివారం సిద్ధాంతంలో ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాలులో ఎంఎల్‌ఎ రంగనాథరాజుకు వ్యతిరేకంగా వైసిపి అసమ్మతి నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా తాజాగా సోమవారం ఆచంట ఎఎంసి కార్యాలయంలో ఎంఎల్‌ఎ రంగనాథరాజు అనుకూల గ్రూపు కూడా దీనికి పోటాపోటీగా విలేకర్ల సమావేశం నిర్వహించి వైసిపికి వ్యతిరేకంగా పార్టీకి చెడ్డ పేరు తీసుకొచ్చేలా, పేరు ప్రతిష్టలు దిగజార్చేలా అసమ్మతి నాయకులు ప్రవర్తించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ రంగనాథరాజు, ఉభయగోదావరి జిల్లాల ఇన్‌ఛార్జి మిథున్‌రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా తాజాగా వైసిపి అసమ్మతి నాయకులు వైట్ల కిషోర్‌కుమార్, కడలి నాగగోవిందరాజులు కూడా ఎంఎల్‌ఎ రంగనాథరాజు అభ్యర్థిత్వాన్ని మార్పు చేయాలని మిథున్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నట్లు సమాచారం.

చింతపర్రు స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని ఎస్‌కెపి, టివిఆర్ మున్సిపల్ హైస్కూళ్లలో పని చేసిన కాలంలో విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషించడం రుజువైనందుకు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని చింతపర్రుకు చెందిన ఆయన డిప్యుటేషన్‌పై మున్సిపల్ స్కూళ్లలో పనిచేశారు. ఈ సంఘటనపై మండల విద్యాశాఖాధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా సిసిఎ నిబంధనల ప్రకారం ఆయనను సస్పెన్షన్ చేసినట్లు డిఇఒ తెలిపారు.

తాడేపల్లిగూడెం డిఎస్‌పిగా డిఎస్‌ఎన్.మూర్తి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డిఎస్‌పిగా డిఎస్‌ఆర్‌విఎస్‌ఎన్.మూర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా వైజాగ్ సిటీ కమిషనరేట్ నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు.

అనారోగ్య బాధితులకు మందుల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి కొవ్వలి ఫౌండేషన్ ద్వారా మంగళవారం మందులు పంపిణీ చేశారు. నరసాపురానికి చెందిన పెరాలసిస్ బాధితులు చేగొండి నాగ శ్రీనివాస్, నరసింహరావులకు, రోడ్డు ప్రమాదంలో గాయపడి లేవలేని స్థితిలో ఉన్న సయ్యద్‌అహ్మద్‌కు, సీతారామపురానికి చెందిన లివర్ సమస్యతో బాధపడుతున్న మెరిపే మోజేష్‌కు ప్రతి నెలా వారికి అవసరమైన మందులను అందిస్తున్నారు. అందులో భాగంగా ఈ నెలకు సంబంధించిన మందులను మంగళవారం వారికి కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు అందించారు. ఈ కార్యక్రమంలో మల్లాడి మూర్తి, రేవు పద్మారావు, గుడాల నాని, ఎవిఆర్, నండా రామకృష్ణ, బర్రి మురళి పాల్గొన్నారు.

పలు భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆచంట నియోజకవర్గంలో పెనుమంట్ర, ఆచంట మండలాల్లో రూ.4 కోట్లతో నిర్మించిన పలు భవనాలను పిల్లి సుభాష్‌చంద్రబోస్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, ఎంఎల్ఎ రంగనాథరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమానికి ఏ మాత్రం లోటు చేయకుండా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురంలో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

ఘనంగా సరోజినీనాయుడు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

జాతీయ మహిళా దినోత్సవం, భారత కోకిల, భారతదేశ మొట్ట మొదటి గవర్నర్ సరోజినినాయుడు జయంతి వేడుకలను యుకెసి వనితా క్లబ్ ఆధ్వర్యంలో వైఎన్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, వనితా క్లబ్ రీజనల్ ఛైర్‌పర్సన్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎన్ కళాశాల డీన్ గంధం రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ యాకబ్, వనితా క్లబ్ అధ్యక్షురాలు పుప్పాల ఉమామహేశ్వరి, కార్యదర్శి బండి స్వర్ణలత , కోశాధికారి రంగినీడి భరణి, ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషా కమల, తోట అరుణ, సుంకర రాజకుమారి, తోట చంటి, గంటా వెంకట రమణ పాల్గొన్నారు.

ఆకివీడు : మహిళాభ్యుదయానికి ఎంతగానో కృషి చేసిన సరోజినీనాయుడు ఎందరికో మార్గదర్శకురాలని వైసిపి ఉండి నియోజకవర్గ కన్వీనర్ పివిఎల్.నరసింహారాజు అన్నారు. ఆమె జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక సరోజినీనాయుడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ ఛైర్‌పర్సన్లు పుప్పాల సత్యనారాయణ, వంగా జ్యోత్స్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర పాల్గొన్నారు.

చిన్న ల్యాబ్‌లకు న్యాయం చేస్తా : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు వంటి చిన్న పట్టణాల్లో నిర్వహించే మెడికల్ ల్యాబ్‌లు పేథాలజిస్ట్ సారథ్యంలో నడపాలని డిఎంహెచ్ఒ హుకుం జారీ చేయడం తగదని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. పట్టణంలోని చిన్న తరహా మెడికల్ ల్యాబ్‌ల సంఘం తరపున ఎంఎల్ఎను ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి తమ గోడు వినిపించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చిన్న ల్యాబ్‌లకు న్యాయం చేస్తానని చెప్పారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ జవ్వాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అయిభీమవరంలో పోలింగ్‌బూత్‌లను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్‌లు వద్ద కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు, ఓటింగ్ అవకాశాలు పరిశీలిస్తున్నామని తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరులో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన భవన నిర్మాణానికి దాతలు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. భుజబలపట్నం గ్రామానికి చెందిన కనుమూరి మురళీకృష్ణంరాజు, సత్యవతి దంపతులు, వారి కుమారులు వెంకట సుబ్బరాజు, సీతారామరాజు దంపతులు రూ.2 లక్షలు ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్‌కి అందించారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి వీరవాసరం మండల కమిటీ ఆధ్వర్యంలో వీరవాసరం మండలంలోని 50 కుటుంబాల వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. టిడిపి వీరవాసరం మండలాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్ అధ్యక్షతన భీమవరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి వైసిపి నాయకులకు టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ వీరవాసరం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని పాల్గొన్నారు.

'సిపిఐకి బాసటగా నిలవండి'

ప్రజాశక్తి - ఉండి

ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐకి విరాళాలు ఇచ్చి అండగా నిలవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మండలంలోని మహదేవపట్నం, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామాల్లో మంగళవారం ఇంటింటికీ తిరిగి సిపిఐ నిధి సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకటరావు, జిల్లా సమితి సభ్యులు కోన గొల్లయ్య, సనపల శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

భీమవరంలో టిడిపిలో గ్రూపుల పోరు

కోళ్ల నాగేశ్వరరావు వర్సెస్ తోట సీతారామలక్ష్మి
తలలు పట్టుకుంటున్న కార్యకర్తలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఒకపక్క ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టిడిపి భీమవరం నియోజకవర్గంలో గ్రూపు పోరుతో ద్వితీయశ్రేణి నాయకుల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా టిడిపిలో సీనియర్ నాయకులైన పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు ఇరువురి మధ్య కోల్డ్ వార్ నడుస్తుంది. పార్టీ కార్యక్రమాలు సైతం విడివిడిగా నిర్వహించడంలో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఎవరి శిబిరం వద్దకు వెళ్లాలో, ఎవరి దగ్గరకు వెళ్తే ఏం తంట వస్తుందోనని మదన పడుతున్నారు. మరోపక్క అంజిబాబు దశాబ్ద కాలపు ఎంఎల్ఎగా కొనసాగినప్పటికీ 2019లో ఓటమి పాలై పార్టీకి దూరంగా ఉంటున్నారు.

ఇటీవల లోకేష్ యువగళం పాదయాత్రలో లోకేష్‌పై దాడి జరిగిన సమయంలో కోళ్ల నాగేశ్వరరావు ఆయన పక్కనే ఉండి అప్రమత్తమయ్యారు. లోకేష్‌ను కాన్వాయ్‌లోకి పంపించి ప్రత్యర్థి గ్రూపు ముందు ధీటుగా నిలబడ్డారు. దీంతో లోకేష్ దృష్టిలో కూడా కోళ్లకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సమయంలో తాను ఎంఎల్ఎగా పోటీ చేస్తానని కోళ్ల బహిరంగంగానే ప్రకటించారు. ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పలు నియోజకవర్గాల రాజకీయ పరిశీలకులుగా కోళ్లను పార్టీ అధిష్ఠానం నియమించింది. దీంతో నాటి నుంచి సీతారామలక్ష్మితో కలిసి కోళ్ల ముందుకు సాగుతూ వచ్చారు. ఇటీవల ఇద్దరి మధ్య దూరం పెరగడంతో కార్యకర్తలు నిరాశా, నిస్పృహలకు గురవుతున్నారు. ఇటీవల ఆచంటలో రా..కదలిరా చంద్రబాబు కార్యక్రమానికి సైతం ఇద్దరి గ్రూపులు విడివిడిగానే జన సమీకరణలు చేసుకుని ఆచంట తరలివెళ్లారు. పెద అమిరంలో జరిగిన జయహో బిసి సభకు కోళ్లకు పిలుపు రాకపోవడంపై కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారిద్దరి గ్రూపుపోరును అధిష్ఠానం పరిష్కరించాలని కార్యకర్తలు కోరుతున్నారు.

అంతర్గత కుమ్ములాటలకు పరిష్కారమేదీ..!

జనసేన-టిడిపి కూటమిలో భాగంగా భీమవరం నుంచి పవన్ పోటీ చేస్తారని తెలుస్తోంది. ఈ తరుణంలో టిడిపి జనసేనకు ఏ మేరకు సహకరిస్తుందో చూడాలి. దీనికి తోడు కోళ్ల నాగేశ్వరరావు, తోట సీతారామలక్ష్మి గ్రూపుల పోరు వల్ల కూటమికి నష్టం తప్పదని సంకేతాలు కూడా బలంగానే వినిపిస్తున్నాయి. అధికార పార్టీ వ్యతిరేక గాలులు వీస్తున్న సమయంలో భీమవరంలో పవన్ గెలుపు సునాయాసంగానే ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా గ్రంధి రాజకీయ క్రీడ

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తన రాజకీయ క్రీడను మొదలుపెట్టారు. దీనిలో భాగంగానే గెలుపుపై వ్యూహాలను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నారు. టిడిపి- జనసేన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలకు గాలం వేసి పార్టీలోకి తీసుకొస్తున్నారు. మరోసారి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఓడించి తన గెలుపుతో సత్తా చూపించాలని గ్రంధి సిద్ధమవుతున్నారు.

త్వరలో జిల్లాకు కొత్త బస్సులు

రోడ్డు రవాణా సంస్థ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి
ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు

జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

త్వరలో జిల్లాకు కొత్త బస్సులు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక ఆర్‌టిసి గ్యారేజీలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కె.గోపీనాథ్‌రెడ్డి, ఆర్‌టిసి విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు, విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్, భీమవరం పట్టణ సిఐ అడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి మాట్లాడుతూ గత నెల 15న ప్రారంభించిన ఈ మాసోత్సవాల్లో వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సంస్థ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు ఏ ప్రమాదం జరగకుండా డ్రైవింగ్ చేయడమంటే చాలా గొప్ప విషయమని, సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లందరూ క్రమశిక్షణ కలిగి తగిన విశ్రాంతి తీసుకుని విధులకు హాజరు కావాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు ఫ్యాటల్ ఆక్సిడెంట్ జరగని నరసాపురం డిపోను ఆయన అభినందించారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌టిసి అంటే క్రమశిక్షణకు మారుపేరని చెప్పారు. యాజమాన్యం వెహికల్ కండిషన్ మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి బస్సుకు సిగ్నల్ లైట్స్ పనిచేసేలా వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణ సిఐ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ మోటార్ సైకిల్స్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలనే స్లొగన్స్ అన్ని బస్సుల్లో కూడా ప్రదర్శించాలని కోరారు. విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆర్‌టిసి సంస్థ అంటే ప్రజల సంస్థ అని అన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ప్రమాద రహిత డ్రైవర్లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన డ్రైవర్లను, నాలుగు డిపోల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రమాద రహిత డ్రైవర్లను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెనుగొండ :స్థానిక ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వైవివి.అప్పారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటించాలన్నారు. సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్, సీనియర్ ట్రైనింగ్ డైరెక్టర్ ఎం.వాసు, జమ్మయ్య, మోహన్ డ్రైవింగ్ స్కూల్ డైరెక్టర్ కంబాల మోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు టి.దివాకర్, ఆర్ఎన్.శ్రీనివాస్, పి.మీరయ్య, మహేష్ పాల్గొన్నారు.

'వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం'

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. మండల కేంద్రమైన మొగల్తూరు, కొత్తపాలెం గ్రామాల్లో టిడిపి హయాంలో నిధులు మంజూరు చేసి నిలిచిపోయిన పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన మొగల్తూరు నుంచి భీమవరం గ్రామీణ మండలం వెంప వరకు ఆర్‌అండ్‌బి రహదారికి రూ.12.65 కోట్లు, గొంతేరు డ్రెయిన్‌పై కొత్తపాలెం-కంసాల బేతపూడి గ్రామాలను అనుసంధానం చేస్తూ వంతెన నిర్మాణానికి రూ.16.50 కోట్లు గతంలోనే నిధులు మంజూరు చేశామన్నారు. ఆ పనులకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారని, నేటికీ పనులు పూర్తి కాలేదని చెప్పారు. నియోజకవర్గంలో రూ.3,200 కోట్లతో అభివృద్ధి చేశామంటూ అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రసాదరాజును నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహన్‌రావు, నాయకులు ఉండ్రాజు రామన్న, చంపాడు సత్యనారాయణరాజు, బస్వని ఏడుకొండలు, కుమ్మరపురుగు తాతాజీ, ఎంపిటిసి మాజీ సభ్యులు గోవిందరాజు, దుది బాబు, డోల్లా రత్నంరాజు, ఆకన కోటి, సత్యనారాయణ, కవురు నాగేశ్వరరావు, సత్యనారాయణ, రంగారావు, ఇంజేటి కిషోర్, ఏసు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన
మాజీ మంత్రి సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో సిఎం జగన్ అరాచక పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. ఆచంట పంచాయతీ పరిధి కౌరుపాలెం, పోరా చెమ్మచెరువు, పెదపేటలో ప్రజల వద్దకు పితాని కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గంలో రంగరాజు తన అనుచరులకు అవినీతి చేసేందుకు లైసెన్స్ ఇచ్చారని సొంత పార్టీ నేతలే రంగరాజు అవినీతి పోకడపై గళం వినిపించారన్నారు. గోదావరి వరదలు వచ్చినప్పుడు లంక వాసులకు సొంత నిధులతో భోజనాలు పెడుతున్నానని చెప్పుకునే రంగరాజు అనంతరం బిల్లులు పంపించి సొమ్ము చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొడవర్తి శ్రీరాములు, జెడ్‌పిటిసి సభ్యులుఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి ఎర్రగుప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడపాటి దుర్గాప్రసాద్, జనసేన మండలాధ్యక్షులు జవ్వాది బాలాజీ నాయుడు, నంబూరి విజయ్ నెక్కంటి ప్రభాకర్, పితాని లక్ష్మణ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి సాయం

ప్రజాశక్తి - గణపవరం

ఎస్‌బిఐ ద్వారా ప్రజలకు రుణాలందించడమే కాకుండా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలకు కూడా సహకారం అందిస్తుందని బ్యాంకు రీజియన్ మేనేజర్ రంగాచార్యులు అన్నారు. పిప్పరలో బ్యాంకు ఆధ్వర్యాన స్థానిక అంగన్వాడీ కేంద్రం అభివృద్ధికి రూ.లక్ష విలువైన పరికరాలు అందించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రంగాచార్యులు మాట్లాడారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాలకు అన్ని రకాల వసతులు ఏర్పాటుకు తాము సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ పిప్పర సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గాభవాని, ఎంపిటిసి సభ్యులు వి.వీరమ్మ, అంగన్వాడీ టీచర్ బి.అనిత పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

కలెక్టర్‌కు గొరగనమూడి జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారుల వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

పట్టాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇళ్ల స్థలాలు కేటాయించలేదని, తమకు న్యాయం చేసి ఆదుకోవాలని గొరగనమూడి జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు కలెక్టర్ పి.ప్రశాంతి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలని కోరుతూ భీమవరం కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ సర్వే నెంబర్ 29లో నాలుగు ఎకరాల స్థలం రైతుల నుంచి డి పట్టా భూములను తీసుకున్నారన్నారు. ఈ భూమిలో సుమారు వంద మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి మూడేళ్లు గడుస్తున్నా భూమిని స్వాధీనం చేయలేదన్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ ప్రశాంతిని కోరారు. లేకపోతే రెండు మూడు రోజుల్లో గొరగనమూడిలో పివి.రావుమాలమహానాడు, ఎస్‌సి బిసి సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించకుంటే 16న సమ్మె

మార్టేరు వరి పరిశోధన స్థానం కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఆచంట

మార్టేరు వరి పరిశోధన స్థానం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

యూనివర్సిటీ పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు వరి పరిశోధన స్థానంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 16వ తేదీ నుంచి సమ్మెలోకి దిగుతామని కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె నోటీస్ ఇచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం గేటు ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి ఫారం మేనేజర్ వీరయ్యకు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని కాంట్రాక్ట్ కార్మికులు ఏళ్ల తరబడి పని చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి ప్రోత్సాహకాలు లేకపోవడంతో ఒట్టి చేతులతోనే రిటైర్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను అవుట్‌సోర్సింగ్ సర్వీసెస్‌లో చేర్చాలని, సహజ, ప్రమాదవశాత్తు మరణానికి రూ.రెండు లక్షల నుంచి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని, పని ప్రదేశంలో పాముకాటుకు, ఇతర ప్రమాదాలకు గురైన కార్మికులను రీసెర్చ్ స్టేషన్ అధికారులే బాధ్యత తీసుకుని వైద్యం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ నాయకులు డి.నూకరత్నం, కట్టా శ్రీలక్ష్మి, బొంతు నాగలక్ష్మి, లక్ష్మీపార్వతి, వెలగల సావిత్రి పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో దగ్గులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి విశ్వనాథం కనకభద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వరప్రసాద్‌రావు మాట్లాడారు. ఇటువంటి వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ వినియోగించుకుని బిపి, షుగర్ ఇతర వ్యాధులకు పరీక్షలు చేయించుకుని మందులు సక్రమంగా వాడాలన్నారు. గ్రామ సర్పంచి కనకభద్రం మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు మారుమూల ప్రాంతంలో అనారోగ్యంతో బాధపడేవారికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు మండల ఇఒపిఆర్‌డి హైమావతి, సర్పంచి విశ్వనాథం పేరయ్య, వార్డు సభ్యులు కలిదిండి రామచంద్ర రాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు అందేకోటి వీరభద్రం, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు నరసాపురంలో...

నరసాపురం :పట్టణంలోని గాంధీనగర్ సచివాలయంలో 16, 17 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

వైసిపి పాలనలో దళితులకు, బిసిలకు అన్యాయం

మహాసేన అధ్యక్షుడు రాజేష్

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపి పాలనలో దళితులకు, బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని మహాసేన అధ్యక్షుడు రాజేష్ విమర్శించారు. శృంగవృక్షంలో టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికి టిడిపి, ఇంటింటికి మన రాంబాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. శృంగవృక్షంలో మహాసేన అధ్యక్షుడు రాజేష్ ఎంఎల్ఎ రామరాజును కలిసి నిడదవోలులో నిర్వహించనున్న జగన్‌తో దగాపడిన దళితుడా రా కదలిరా సభకు రావాలని ఆహ్వానించారు. స్థానిక సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఇరువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, సీనియర్ నాయకులు ప్రసాదరాజు, నాయకులు కామన రాంబాబు, క్రోవిడి దుర్గ, వీరవల్లి వెంకటలక్ష్మి, జక్కంశెట్టి అశోక్, ఏడుకొండలు, విశ్వనాథరాజు, ఆరేపల్లి నాగరాజు, వనం వెంకటేష్, కమ్మిలి రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా అద్దేపల్లి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్వాతంత్ర్య సమర యోధులు, విద్యాదాత అద్దేపల్లి సత్యనారాయణమూర్తి 125వ జయంతి వేడుకలను ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మాటూరి నర్సింహమూర్తి, వంగా నరసింహరావు, జక్కంపూడి కుమార్, ఉన్నమట్ల కబర్ధి, రేపాక ప్రవీణ్ భాను పాల్గొన్నారు.

పాఠశాలలో 'తల్లిదండ్రులకు వందనం'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక శ్రీ చైతన్య యాజమాన్యం తల్లిదండ్రులను పూజిద్దాం అనే ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో తల్లితండ్రులకు పాదపూజ చేసి, సత్కరించి విద్యార్థులతో తల్లిదండ్రులకు బహుమతులు అందించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రసాద్ తెలిపారు. పురాతన ఆచారాలను మరిచిపోకుండా భావితరాలకు అందించే ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ నాగార్జున, సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం సిపిఎం పోరాటం

ప్రజాశక్తి - భీమవరం

అభివృద్ధి కోసం నిజాయితీగా నిస్వార్థంగా సిపిఎం నిరంతరం పాటు పడుతుందని ఆ పార్టీ పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు అన్నారు. పట్టణంలో మంగళవారం విరాళాలను సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, త్రిమూర్తులు, నాగు, కె.కృష్ణ, నాగేశ్వరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SUGUNA BOORADA (Old Name), W/o. MURALI KRISHNA, Resident of D.No. 20C-11-5, Tumarada vari Street, Tagore Centre, Eluru-534002, A.P. I have changed my Name as **TUMARADA VENKATA SUGUNA** (New Name), W/o. MURALI KRISHNA, Hereafter my name is known as **TUMARADA VENKATA SUGUNA** (New Name), W/o. MURALI KRISHNA

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. 19/2022 in O.S. 305/2018

బిట్వీన్:
కరుటూరి రామకృష్ణ -DHR
మరియు
దేవా బాలకృష్ణ -JDR

JDR: దేవా బాలకృష్ణ, S/o. పోలారావు, డో.నెం. 2-36, జగన్నాధపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం.

పై నెంబరు గ్రంథము నందు JDR అయిన మీకు శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఎన్ని పర్యాయములు U/Order 21, Rule 37 CPC నోటీసులు పంపిననూ మీరు సదరు నోటీసులు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. పై కోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు పై నెంబరు గ్రంథములో ఈ యొక్క పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియచేయునది ఏమనగా పై నెంబరు గ్రంథము **ది. 26-02-2024వ సం॥ వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10.30 ని॥ల** నుండి మీరు గాని, మీ యొక్క వకీలు ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిపక్షమున మీకు వ్యతిరేకంగా తీర్మానం జరుగును అని ఈ యొక్క పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

శ్రీనివాసరావు ముళ్ళపూడి
తాడేపల్లిగూడెం న్యాయవాది
ది.12-2-2024 సెల్: 8919071651

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. 18/2023 in O.S. 299/2018

బిట్వీన్:
ముళ్ళపూడి నాగేశ్వరరావు -DHR
మరియు
దేవా బాలకృష్ణ -JDR

JDR: దేవా బాలకృష్ణ, S/o. పోలారావు, డో.నెం. 2-36, జగన్నాధపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం.

పై నెంబరు గ్రంథము నందు JDR అయిన మీకు శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఎన్ని పర్యాయములు U/Order 21, Rule 22 CPC నోటీసులు పంపియున్ననూ మీరు సదరు నోటీసులు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. పై కోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు పై నెంబరు గ్రంథములో ఈ యొక్క పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియచేయునది ఏమనగా పై నెంబరు గ్రంథము **ది. 26-02-2024వ సం॥ వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10.30 ని॥ల** నుండి మీరు గాని, మీ యొక్క వకీలు ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిపక్షమున మీకు వ్యతిరేకంగా తీర్మానం జరుగును అని ఈ యొక్క పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

శ్రీనివాసరావు ముళ్ళపూడి
తాడేపల్లిగూడెం న్యాయవాది
ది.12-2-2024 సెల్: 8919071651